కథా కౌముది

# అమ్మకాని(కో)అమ్మ

## విరించి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**ఆ పల్లెటూరు** కావాలని పట్నంలో కలవలేదు. ప్రక్కనున్న పట్నమే ఆ పల్లెటూర్ని కబళించి మహానగరమై కూర్చుంది. వెంకటలక్ష్మి నాలుగేళ్ళ క్రితం ఇంటి అరుగుల మీద రెండు కొట్టుగదులు కట్టించి, ఒక దాన్లో బ్రతుకు తెరువుకోసం కిరాణాకొట్టు పెట్టినప్పుడు అది ఒక మాదిరి పల్లెటూరు. ప్రక్కనే పెద్దమనిషిలా వున్న పట్నం క్రమేపీ ముందుకు జరుగుతూ ఈస్ట్ ఇండియా కంపెనీలా ఆ పల్లెటూర్ని ఆక్రమించింది.

ఇప్పుడు వెంకటలక్ష్మి కొట్టుకు గిరాకీలు లేవు. దగ్గర్లోనే మోర్‌లు, డి మార్ట్‌లు, స్పెన్సర్‌లు వచ్చేసాయి. ప్రతీవాడు స్నానాలగదికి వెళ్ళాక సబ్బు లేకపోతే లుంగీతో సరాసరి వాటికే పోతున్నాడు. తన దగ్గరకు వచ్చేవి కేవలం అరువు బేరాలే.

పెనిమిటి నారాయణ అడ్డమైన తిరుగుళ్ళకు, అధిక త్రాగుళ్ళకు అలవాటు పడి అనారోగ్యంతో మంచాన పడ్డాడు. కూతురు గీత కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. అవసరాలు అప్పులు పెరిగాయిగానీ వెంకటలక్ష్మికి ఆదాయం, అవకాశాలు పెరగలేదు. వెంకటలక్ష్మి కుట్టుమిషన్ కుట్టినా, కుట్టుడాకులు కుట్టినా, లేసులు అల్లినా గోదావరి ఈత లంక మేతలా వుంది.

రోజూలాగే ఉదయం పదిగంటలకు వెంకటలక్ష్మి అరుగుమీద కొట్టు తలుపు తీసింది. రెండో అరుగుమీద టైలర్ కుర్రాడు రామకృష్ణకు అద్దెకిచ్చిన కొట్టుగది ఇంకా తెరవలేదు. దేవుడి ఫోటోకి దండం పెట్టుకుని ఎత్తుపీట మీద కూర్చుంది.

మోటారు సైకిల్ శబ్దాన్ని బట్టి వచ్చింది భూషణం అని అర్ధమయ్యింది. భూషణం కొట్టుముందు బండి ఆపి స్టాండ్ వేస్తున్నాడు. భూషణం ఆ ఊర్లో ఆర్.ఎంపి డాక్టరే కాదు. అందరికీ తలలో నాలుకలో ఉంటాడు. వరుసకు వెంకటలక్ష్మికి బాబాయి అయినా, ఊళ్ళో అందరూ కూడా 'బాబాయ్' అనే పిలుస్తారు.

"ఎంకటలక్ష్మీ! ఓ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకోవే" అన్నాడు భూషణం చనువుగా. వెంకటలక్ష్మికి అరువు బేరమని తెలుసు.

"ఇంకా బోణీ కాలేదు బాబాయ్! కూర్చుని కాఫీ తాగుతూ ఉండు. బోణీ అవగానే ఇస్తా" అంది.

"సిగరెట్‌కు కాఫీ ఫ్రీయా?" అన్నాడు భూషణం నవ్వుతూ. అక్కడే ఉన్న స్టూల్ లాక్కుని కూర్చున్నాడు.

"నువ్వు సిగరెట్ కొనకపోయినా ఎప్పుడూ నీకు కాఫీ ఫ్రీనే కదా!" అంది వెంకటలక్ష్మి కూడా నవ్వుతూ.

"ఏం వద్దులే. ఇప్పుడే టీ తాగొచ్చా. ఒక్క నిముషం... నారాయణను చూసి ఇంజెక్షన్ చేసొస్తా" అని లోపలికి వెళ్ళాడు.

మరో పదినిముషాలలో అతగాడు బయటికి వచ్చేసరికి ఏవో రెండు బేరాలు వచ్చాయి. భూషణం వచ్చి కూర్చున్నాడు.

''ఎలా వుంది వ్యాపారం?'' అన్నాడు భూషణం.

''నీకు తెలియనిదేముంది బాబాయ్. అమ్మకాల్లేవ్. అరువిస్తే తిరిగిరావు. అడిగితే కోపాలు. ఏదైనా మా కష్టాలు తీరే మార్గం చెప్పు బాబాయ్. చచ్చి నీ కడుపున పుడతా '' అంది వెంకటలక్ష్మి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె ఇస్తూ.

భూషణం సిగరెట్ వెలిగించి గట్టిగా ఓ దమ్ములాగాడు. ఒకసారి వెంకటలక్ష్మికేసి చూసి ''అది అసంభవం కానీ.. ఇప్పుడు నీకు ఎన్నేళ్ళే?'' అన్నాడు.

''ముప్పై ఆరు.. నా వయస్సుకు, నా కష్టాలకు సంబంధం ఏమిటి బాబాయ్?'' అంది వెంకటలక్ష్మి.

''ఉంది అంటే ఉంది. లేదు అంటే లేదు. నీ కష్టాలు తీరిపోయే పనోటి ఉంది. నువ్వేం బరువులెత్తక్కర్లేదు. నారాయణ వైద్యం, గీత చదువు, పెళ్ళి అన్నీ అయిపోతాయి. కానీ.. నిన్ననే ఒకళ్ళకు మాటిచ్చాను. ఎలా అబ్బా?'' అన్నాడు భూషణం సాలోచనగా.

''అదేంటి బాబాయ్? చెట్టంత మనిషిని నన్ను ఇక్కడ పెట్టుకుని ఎవరికో మాటివ్వడం ఏమిటి?'' అంది వెంకటలక్ష్మి నిష్ఠూరంగా.

''నువ్వు ఒప్పుకుంటావో లేదో నాకు తెలియదు. అందుకని..'' సందేహంగా అన్నాడు భూషణం.

''అదేం? అంత కానిపనా?''

''రామ..రామ.. నీ సంగతి నాకు తెలియదా? నిప్పులాంటి మనిషివి నువ్వు''

''అయితే చెప్పు. ఇష్టమైతే చేస్తాను. లేదంటే లేదు. ఏంటో చెప్పు'' అంది వెంకటలక్ష్మి కుతూహలంగా.

''నువ్వు టైలర్ రామకృష్ణకు కొట్టు గది అద్దెకిచ్చావ్. సంవత్సరానికి ఆడెంతిస్తాడు?'' అన్నాడు భూషణం.

''పన్నెండువేలు''

''నీ ఇల్లు అద్దెకిచ్చావనుకో ఎంతొస్తుంది?''

''నెలకు మరో రెండు.. సంవత్సరానికి ఇరవైనాలుగువేలు''

''అవునా? అలాగే అద్దెకిచ్చేవాటిలో కొట్లు, కార్లు, ఇళ్ళు తోటతోపాటు ఈ మధ్య ఇంకోటి కూడా అద్దెకిస్తున్నారు తెలుసా?'' అన్నాడు భూషణం.

అయోమయంగా చూసింది వెంకటలక్ష్మి.

''ఏంటది?'' అంది.

''గర్భాశయం'' అన్నాడు భూషణం తాపీగా సిగరెటి రింగులు వదులుతూ.

''అంటే?''

''ఈ దేశంలో జనాభా పాపంలా ఇంతలా పెరిగిపోతున్నా సంతానం లేని దంపతులు ఎందరో ఉన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా సంతానం కలగనివాళ్ళు, గర్భసంచి వృద్ధిచెందనివాళ్ళు, గర్భసంచి తొలగించబడిన వాళ్ళు, వయస్సు అయిపోయిన వాళ్ళు... వాళ్ళకు సంతానం కావాలంటే ఒకటే మార్గం. అలాంటి దంపతుల అండాన్ని, శుక్రకణాల్ని తీసుకుని ఫలదీకరణ జరిపి, అద్దెగర్భమిచ్చే స్త్రీ గర్భాశయంలో ప్రవేశపెడతారు'' అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మికి కొంత అర్థమయ్యి అర్థంకానట్లుగా ఉంది.

''ప్రవేశపెడితే పిల్లలు పుడతారా?''

''ఆ అద్దె గర్భమిచ్చిన తల్లి నవమాసాలు మోస్తే పుడతారు''

''అవునా?'' అంది వెంకటలక్ష్మి ఆశ్చర్యపోతూ.

"అప్పుడే అంత ఆశ్చర్యపోకు. ఇంకా పూర్తిగా విను. అలా అద్దెకిస్తే ఓ సంవత్సరంలో రెండు మూడు 'ల'కారాలు కళ్ళచూడొచ్చు. మన ఊళ్ళో ఇద్దరాడాళ్ళకు అలా ఇప్పించాన్లే" అన్నాడు భూషణం.

"నీకేటి లాభం?" అంది వెంకటలక్ష్మి.

"ఏదో ఆళ్ళ కష్టాలు చూడలేక, నువ్వడిగినట్లే ఆళ్ళూ 'మా కష్టాలు తీరే మార్గం చెప్పు బాబాయ్' అంటే జాలిపడి, సిటీలో మనకు తెల్సున్న డాక్టర్ల చేత ఇప్పించా" అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మి ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి. ఆకలి, అవసరం ఏ పనైనా చేయిస్తుంది. ఆ పని తనే ఎందుకు చేయకూడదూ? ఓ సంవత్సరం కష్టపడితే నారాయణకు సరైన వైద్యం చేయించవచ్చు. గీతకు మంచి చదువు చెప్పించి, సరైన సంబంధం చూసి పెళ్ళి చేయొచ్చు.

"ఇంకా ఎంతమంది కావాలేటి బాబాయ్?" అంది వెంకటలక్ష్మి.

"కావాలీ అంటే.. ప్రయత్నం చెయ్యాలి."

"నేను పనికొస్తానా?"

"నీకేం? నిక్షేపంలా"

"ఓ నాల్గు ఇప్పించు. కష్టపడినా ఫలితం దక్కాలికదా! నా సమస్యలు తీరిపోతాయి" అంది ప్రాధేయపూర్వకంగా.

"అంత మొత్తం కష్టంకానీ రెండున్నర, మూడు ఇవ్వొచ్చు. నువ్వు సంవత్సరంపాటు డాక్టర్‌గారి హాస్పిటల్లోనే ఉండాలి. ఫుడ్డు, బెడ్డు, మందు, మాకు అన్నీ ఆళ్ళే చూసుకుంటారు. నువ్వు అక్కడున్నట్లు ఎవ్వరికీ తెలియదు. తెలియకూడదు"

"మరి ఈ రోగిష్టోడ్ని, పిల్లని వదిలేసి ఎలా?"

"మీ ఊర్నుంచి మీ అమ్మని రమ్మని ఇక్కడ పెట్టు. నీ మొగుడికి కూతురికి వండిపెడుతుంది. నేను వున్నాగా. నేను రోజూ వచ్చి చూస్తా. నువ్వు దుబాయ్ షేక్‌ల ఇళ్ళలో పనికి దుబాయ్ వెళ్తున్నానని, సంవత్సరం అవగానే వచ్చేస్తానని అందరికీ చెప్పు. మిగతావన్నీ నేను చూసుకుంటాను" అన్నాడు భూషణం.

"సరే. ఓ రెండు రోజులు టైమియ్యి. ఆలోచించి చెప్తా. ఈ లోపులో నీ ప్రయత్నాలు నువ్వు చెయ్యి" అంది వెంకటలక్ష్మి.

"సరే! వస్తా" అని లేచి బండి స్టార్ట్ చేసి బయల్దేరాడు భూషణం.

ఆరోజంతా ఆలోచనలతోటే గడిపింది వెంకటలక్ష్మి. ఎవరైనా ఎదురుపడితే 'ఎంతమంది సంతానం?' అని అడుగుతారుగానీ 'ఎంత సంపాదించావ్?' అని అడగరు. సంతానం వృద్ధాప్యంలో ఆదుకుంటారని మనిషి ఆశ. రెక్కలొచ్చిన పక్షులు ఎగరకుండా ఉంటాయా?

నిజానికి గర్భం ధరించిన ప్రతీసారి తల్లికి, బిడ్డకు అపాయం ఎప్పుడూ పొంచి ఉంటుంది. ప్రసవం ప్రతిసారీ స్త్రీకి పునర్జన్మే. కానీ చేసిన అప్పులు, మొగుడి అనారోగ్యం, కూతురు చదువు, పెళ్ళికోసం రిస్క్ చెయ్యక తప్పదు. ఇప్పుడు తనకు అంతకంటే మరో మార్గం లేదు. ఓ రెండు రోజులు ఆలోచించిన తర్వాత ఆపని ఒప్పుకోవాలనే నిర్ణయానికి వచ్చింది.

తల్లిని ఊరునుంచి రప్పించింది. తను దుబాయ్ వెళ్తున్నట్లు చెప్పి మొగుడిని, కూతురుని తను లేకుండా సంవత్సరం ఉండేట్లు మానసికంగా సిద్ధం చేసింది. పాస్‌పోర్ట్ కోసం వెళ్తున్నానని భూషణాన్ని తీసుకుని సిటీలో హాస్పిటల్‌కు వెళ్ళి డాక్టర్‌ను కలిసొచ్చింది. కొన్ని పరీక్షలు తర్వాత డాక్టర్ ఏ తారీఖున హాస్పిటల్‌లో జాయిన్ అవ్వాలో చెప్పారు.

మర్నాడు ఉదయన్నే టైలర్ రామకృష్ణ కొట్టు తాళాలు తీస్తూ "లచ్చక్కా! ఇది నిజమేనా? దుబాయ్ వెళ్తున్నావా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవునురా! ఒక్క సంవత్సరంలో మళ్ళీ వచ్చేస్తాను. నేను వచ్చేదాకా కాస్త కనిపెట్టుకుని ఉండు. ప్రొద్దున్న, సాయంత్రం గీత కొట్టు తీస్తుంది. ఏం కావాలన్నా చూస్తూండు" అంది వెంకటలక్ష్మి.

"అలాగే అక్కా!" అన్నాడు రామకృష్ణ.

"ఎంకటలక్ష్మీ నువ్వెళ్ళిపోతే నా వైద్యం, కూడు ఎలాగే?" అన్నాడు నారాయణ మంచంమీద నుంచే. ఏదో అడగాలని అడిగాడు కానీ నారాయణ ఒక విధంగా ఆనందంగానే ఉన్నాడు. వెంకటలక్ష్మి లేకపోతే దొంగతనంగా అయినా మందు తాగొచ్చని. సిరోసిస్ కబళిస్తుందని భయంలేదు.

"మా యమ్మ వండిపెడ్తుంది. అడ్వాన్స్ తీసుకుని సంవత్సరానికి సరిపడా గ్రాసం ఇంట్లో పడేసిపోతాను. నీ రోగానికి వైద్యం భూషణం బాబాయ్ చూస్తాడు. సరేనా?" అంది.

వెళ్ళాల్సిన రోజు రానే వచ్చింది. అందరికీ అప్పగింతలు, హెచ్చరికలు జాగ్రత్తలు చెప్పడం అయిపోయాక బ్యాగు సర్దుకుని రెడీగా ఉంది.

"బండెక్కు, నిన్ను దుబాయ్ ఫ్లయిట్ ఎక్కిస్తా. పద" అన్నాడు భూషణం.

హాస్పిటల్‌లో జాయిన్ అయ్యింది. వెంకటలక్ష్మి అదే మొదటిసారి ఎ.సి రూంలో ఉండటం. ఎ.సి, ఫ్రిడ్జ్, గీజర్ వంటి ఆధునిక సదుపాయాలతో ఎంతో సౌకర్యవంతంగా ఉంది.

టైం ప్రకారం బలవర్ధకమైన ఆహారం, మందులు ఇస్తున్నారు. టెస్టులు జరుగుతున్నాయి. మొదటి ప్రయత్నంలోనే విజయవంతంగా ఫలదీకరణ జరిగిందని తెలిసి వెంకటలక్ష్మి సంతోషించింది. అడ్వాన్స్‌గా లక్షరూపాయలు తన అక్కౌంటులో వేసారు. నెలకోసారి దుబాయ్‌నుంచి మాట్లాడుతున్నానని, అంతా సౌకర్యంగా ఉందని ఇంటి ల్యాండు ఫోనుకు చేసి మాట్లాడుతోంది. అది అధునాతన సంతాన సాఫల్య కేంద్రం. తనలాంటివాళ్ళు ఇంకా అయిదారుగురు పైనే ప్రక్కగదుల్లో ఉన్నట్లున్నారు. కానీ, ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడకూడదు.

భూషణం తరచూ వచ్చి వెంకటలక్ష్మిని చూసి వెళ్తున్నాడు. నెమ్మదిగా రోజులు, నెలలు గడిచిపోతున్నాయి. భూషణం మొదట వారికి ఒకసారి వచ్చినవాడు, ఇప్పుడు నెలకోసారి వస్తున్నాడు.

మొదట్లో తను ఫోన్ చేస్తే ఉత్సాహంగా మాట్లాడే తల్లి, మొగుడు, కూతురు ఇప్పుడు ఫోనే ఎత్తడం లేదు. తనుకూడా చెయ్యడం తగ్గించేసింది. భూషణం మొహంలో కూడా మొదటంత ఉత్సాహం కనపడటంలేదు. ఏదో పోగొట్టుకున్నవాడిలా ఉంటున్నాడు. ఎప్పటికప్పుడు ఎప్పుడు పని పూర్తవుతుందా అని చూస్తున్నట్లుగా ఉంది అతని వాలకం. క్రమంగా నవమాసాలు పూర్తయ్యాయి.

వెంకటలక్ష్మి మనస్సులో అనిర్వచనీయమైన భావన. తనిదికాని ప్రాణిని తను మోసి జన్మనివ్వబోతోంది. అదో అద్భుతమైన అనుభవం. తను గీతను కన్నప్పుడు కూడా ఇంత అపురూపంగా తనను ఎవరూ చూడలేదు. అప్పుడు తను ప్రసవించే రోజు వరకూ పనులు చేసుకుంటూ కష్టపడ్తూనే ఉంది. ఇప్పుడు వేళ ప్రకారం పాలు, పళ్ళూ, భోజనం, పరీక్షలు జరిగిపోతున్నాయి. తననో గాజు బల్బులా చూసుకుంటున్నారు.

సరిగ్గా డాక్టర్ చెప్పిన రోజునే ప్రసవ వేదన ప్రారంభమయ్యింది. గతంలో ఆ బాధను అనుభవించిన రోజు జ్ఞాపకం వస్తోంది. ఆ రోజు పద్దెనిమిదేళ్ళ క్రితం గీతను కన్నప్పుడు అనుభవించింది. మళ్ళీ ఇన్నాళ్ళకు ఇప్పుడు. తనది కాని ప్రాణం కోసం ప్రసవవేదన.

పండంటి మగబిడ్డను కని డాక్టర్ చేతిలో పెట్టింది. ఒప్పుకున్న బాధ్యతను తను విజయవంతంగా నిర్వర్తించినందుకు ఒకరకమైన తృప్తి. నవమాసాలు మోసిన బిడ్డ పేగు బంధాన్ని తెంచుకోవాలంటే చెప్పలేని బాధ.

బిడ్డను కన్న వారం రోజులకు రూంలోంచి బయటకు వచ్చి చుట్టూ చూడసాగింది. మొహానికి మాస్క్ కట్టుకున్న యువతి కూర్చున్న వీల్‌చైర్‌ను ఆయా తోసుకుంటూ స్కానింగ్‌కు తీసుకెళ్తోంది. కళ్ళు మాత్రమే కనిపిస్తూన్న ఆమెను చూడగానే ఎక్కడో చూసానన్న భావన. ఆ అమ్మాయి తనను ఎక్కడ గుర్తుపడుతుందోనని త్వరగా రూంలోకి వచ్చేసింది. తను కూడా మొహానికి మాస్క్ కట్టుకుని గదిలో కిటికీ దగ్గర నుంచుంది.

అరగంట క్రితం స్కానింగ్‌కు తీసుకెళ్ళిన యువతిని మళ్ళీ వీల్ చైర్‌లో తీసుకొస్తున్నారు. తెలుసున్న మనిషిలా వున్నా ఎవరో గుర్తుపట్టలేకపోయింది. కళ్ళు చూస్తే భీతహరిణేక్షణిలా ఉంది. తననెవరూ గుర్తుపట్టకూడదని ఈసారి మాస్క్‌తోబాటు స్కార్ఫ్ కూడా కట్టినట్లుంది. మొహం కనపడటంలేదు. చిన్నపిల్లే. పద్దెనిమిది, ఇరవై ఏళ్ళు ఉండొచ్చు. అంత చిన్నవయస్సులోనే గర్భధారణా?

వెంకటలక్ష్మి వెనక్కి వచ్చి గదిలో మంచం మీద కూర్చుంది. ఆలోచన్లు పరిపరివిధాల పోతున్నాయి. ఇంటిదగ్గర ముసల్ది ఎలా ఉందో? రోగిష్టి మొగుడు సరిగా మందులు వేసుకుంటున్నాడో లేదో? గీత సరిగ్గా కాలేజ్‌కి వెళ్తుందో లేదో. కిరాణా కొట్టు ప్రొద్దున్నా, సాయంత్రం తీస్తోందో లేదో. టైలర్ రామకృష్ణ ఏదైనా సహాయం చేస్తున్నాడో లేదో. ఈ మధ్య ఫోన్లు కూడా చెయ్యడం లేదు. బాబాయ్ వచ్చికూడా చాలా రోజులయ్యింది. మిగిలిన సొమ్ములు ఇంకా ఇవ్వనే లేదు.

ఆలోచిస్తుండగానే తలుపు చప్పుడైతే చూసింది. భూషణం లోపలికి వస్తున్నాడు.

"బాబాయ్! అంతా కులాసాయేనా?" అంది వెంకటలక్ష్మి కుర్చీ చూపిస్తూ.

"ఆ..." అన్నాడు భూషణం ముక్తసరిగా.

"చెప్తా, నువ్వు ముందు బట్టలు సర్దుకో. ఆసుపత్రి వాళ్ళు మిగిలిన రెండు లక్షలు ఇచ్చేసారు. నువ్వు కొన్నాళ్ళు వాడవలిసిన మందులు కూడా ఇచ్చారు. పద. మనం బయల్దేరుదాం" అన్నాడు భూషణం.

వెంకటలక్ష్మి బట్టల బ్యాగ్ సర్దుకోవడం మొదలు పెట్టింది. తలుపు దగ్గర మళ్ళీ చప్పుడైతే భూషణం గది బయటకు వచ్చాడు.

"భూషణం గారూ పద్దెనిందో నెంబర్ గదిలో పేషెంట్ కోపరేట్ చెయ్యడం లేదు. ఒకటే ఏడుపు. ఇలా అయితే కష్టం" అంటోంది సిస్టర్. వెంకటలక్ష్మికి ఏదో అనుమానంగా ఉంది. ఒక్క ఉదుటున బయటకొచ్చింది. భూషణాన్ని తోసుకుని పద్దెనిమిదో నెంబర్ గదికేసి వేగంగా పరుగెత్తింది. గదిలో అడుగుపెట్టగానే అక్కడ దృశ్యాన్ని చూసి స్థాణువులా నిలబడిపోయింది.

గీత మంచం మీద కూర్చుని ఏడుస్తోంది. జుట్టు చిందరవందరగా ఉంది. మొహం పీక్కుపోయి, దుస్తులు అస్తవ్యస్థంగా ఉన్నాయి.

"గీతా!" అంటూ వెళ్ళి గట్టిగా కౌగలించుకుంది. గీత పొట్టమీద చెయ్యివేసి తడిమి షాక్ అయ్యింది.

"నువ్వు.. నువ్వు ఏమిటిక్కడా?" అంది అయోమయంగా.

గీత మొహంలో బాధ, ఆశ్చర్యం, ఆనంద్మ కలగలిసి ఉన్నాయి.

"అమ్మా! వచ్చావా అమ్మా! నేను చచ్చిపోతానమ్మా" అంటూ బావురుమంది గీత,.

భూషణం వచ్చి నెమ్మదిగా తల్లికూతుళ్ళ తలమీద చెయ్యివేసి అనునయించాడు.

"అమ్మా! వెంకటలక్ష్మీ కంగారు పడకు. స్థిమితంగా కూర్చో, మనస్సు కాస్త దిటవు చేస్కో. అన్ని విషయాలూ చెప్తాను" అన్నాడు.

తల్లీకూతుళ్ళు ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని ఇంకా ఏడుస్తూనే ఉన్నారు. భూషణం కొంతసేపు మౌనంగా ఊరుకున్నాడు. ఓ ఐదు నిముషాలు తర్వాత తల్లీకూతుళ్ళు తేరుకున్నారు.

"గీతా! ఏడుపు ఆపి కాసేపు నిశ్శబ్దంగా ఉండు. వెంకటలక్ష్మీ ఏదీ మన చేతిలో లేదు. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలుస్తాట్ట. అంతా భగవంతుని నిర్ణయం. మనం నిమిత్తమాత్రులం. ఇంటినుంచి నువ్వెళ్ళిన తర్వాత నారాయణ రాత్రీ పగలు మళ్ళీ త్రాగుడు మొదలు పెట్టాడు. సిరోసిస్ తీవ్రమై మూడు నెలలకే బలయిపోయాడు. వయస్సులో ఒంటరిగా ఉన్న గీతను మాయమాటలతో టైలర్ రామకృష్ణ

గర్భవతిని చేసాడు. గీత పెళ్ళి చేసుకోమనగానే బిచాణా ఎత్తేసి పారిపోయాడు. ఇంట్లో ఏడుస్తూ కూర్చున్న గీతను అనుమానం వచ్చి ఈ డాక్టర్‌కు చూపిస్తే, ఆరోనెలని, అబార్షన్ చేస్తే తల్లి ప్రాణానికి రిస్క్ అని చెప్పారు. భ్రూణ హత్య చెయ్యలేక, గీత ప్రాణానికి రిస్క్ తీసుకునే ధైర్యం లేక గత్యంతరం లేని పరిస్థితిలో గీతను సిటీలో హాస్టల్‌లో జాయిన్ చేస్తున్నానని చెప్పి, ఈ హాస్పిటల్‌లో చేర్పించాను. మరో రెండు నెలల్లో పురుడుపోసి, బిడ్డను సంతానంలేని కోటీశ్వర్లుకి పెంపకానికి ఇచ్చే ఏర్పాటు చేసాను. నువ్వు అమ్మకానికో అమ్మవైతే, గీత అమ్మకాని, అమ్మ అని చెప్పుకోలేని అమ్మ. జరిగింది పీడకలగా మర్చిపోవడమే మనం చెయ్యవలిసింది. గతాన్ని తలుచుకుని బాధపడితే జీవితంలో ముందుకు సాగలేం. సంసారంలో మొగాడు సరిగా లేకపోయినా, ఇంట్లో ఆడదిక్కు లేకపోయినా జరిగే అనర్థాలివే" అన్నాడు భూషణం.

తిరుగుబోతు, త్రాగుబోతు భర్త గురించి ఏదో రోజు ఈ వార్త వినవలసి వస్తుందని తెలుసు. కానీ ముక్కుపచ్చలారని గీత జీవితం అన్యాయం అయినందుకు తట్టుకోలేక పోతోంది వెంకటలక్ష్మి. తను ఎవరి బాగోగుల కోసం పంటిబిగువున ఇంత కష్టపడిందో వాళ్ళే సహకరించకపోవడంతో, తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయినందుకు బాధగా వుంది వెంకటలక్ష్మికి.

ఓ పావుగంటకు వెంకటలక్ష్మి షాకునుంచి తేరుకుంది.

"బాబా! మొగుడు రోగైనా, భోగైనా, యోగైనా మొగుడే మగాడే మగాడు మంచం మీద పడున్నా, కంచం ముందు కూర్చున్నా మగాడూ మగదిక్కే. నేను గది అద్దెకిచ్చాను. గర్భాన్ని అద్దెకిచ్చాను. కానీ, శీలాన్ని కాదు. గీత దాటిన గీత జీవితాన్ని సరిదిద్దుదాం. టైలర్ రామకృష్ణ పిరికివాడేగానీ చెడ్డవాడు కాదు. డిగ్రీ చదివాడు. వాడు నా మాట కాదనడు. వాడ్ని పట్టుకుని గీతతో పెళ్ళి చేసేదాకా వదలను. సంతానం లేనివాళ్ళు ఎంతోమంది లక్షలు ఖర్చుపెడ్తూ తలక్రిందులుగా తపస్సు చేస్తూ, గుళ్ళూ గోపురాలు తిరుగుతూ, మందులూ మాకులు మింగుతూంటే, దేవుడిచ్చిన సంతానాన్ని వదిలివేయడం అపరాధం బాబాయ్. సంతానం అనేది సమస్త జీవరాసికి దేవుడిచ్చిన వరం. నువ్వు నాకెంతో చేసావు. ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను బాబాయ్. గీతా! జరిగిందేదో జరిగిపోయింది. ఏడ్చి లాభంలేదు. రామకృష్ణను తీసుకొచ్చి నీకు పెళ్ళి చేసే బాధ్యత నాది. నిశ్చింతగా వుండు" అంది వెంకటలక్ష్మి.

"నన్ను క్షమించు అమ్మా" అంది గీత.

"పిచ్చిపిల్లా" అని ఆప్యాయంగా గీతను దగ్గరకు తీసుకుంది వెంకటలక్ష్మి.

గీత లేత మనస్సునుంచి అపరాధభావం నెమ్మదిగా తొలిగిపోయింది. వెంకటలక్ష్మి సమస్యని ఎదుర్కొనే తీరుకు, గుండె నిబ్బరానికి తృప్తిగా నిట్టూర్చాడు భూషణం.

Click here to share your comments on this story